

పేరుకుపోతున్న రెవెన్యూ దస్త్రాలు..

- ఐదు నెలలుగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీ

ప్రజాశక్తి- యాదమరి: మండలంలో గత ఐదు నెలలుగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉన్నది. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ జ్యోతిని మే 10వ తేదీన ఉన్నఫలంగా బదిలీ చేశారు. అప్పటి నుండి యాదమరి రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీగానే ఉన్నది. రెవెన్యూలో భూసమస్యలు నివేదికలు పంపించడంలో ఆర్ఐ పాత్ర కీలకం. వీఆర్వో నుండి తహశీల్దార్ వరకు ప్రతి నివేదికను ఆర్ఐ విచారణ చేసి పైఅధికారులకు అందించాల్సి ఉంది. ఆర్ఐ లేకపోవడంతో వీఆర్వోలు, తహశీల్దార్లపై పనిఒత్తిడి పెరిగింది. మండలంలో భూసమస్యలు అధికంగా ఉన్నాయి. ఇటీవల మండల కేంద్రంలో జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంకు మండలం మొత్తం వివిధ సమస్యలపై 211 అర్జీలు రాగా అందులో యాదమరి రెవెన్యూ శాఖ సంబంధించి 196 భూ సమస్యలపైనే వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే యాదమరిలో భూసమస్యలు ఏ మేరకు ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ప్రస్తుతం స్పందన అర్జీలు సమస్యలు పరిష్కార దిశగా వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

భూసమస్యలు నివేదికల సిద్ధం చేసేందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ పాత్ర కీలకం. ఆర్ఐ విచారణ చేసి పూర్తి నివేదికను పై స్థాయి అధికారులకు పంపించాల్సి ఉంటుంది. మండల పరిధిలో అధికంగా భూవివాదాలు, కోర్టు కేసులు, రీసర్వే, మ్యూట్యులేషన్స్, అసైన్మెంట్ కమిటీ భూముల గుర్తింపు, స్పందన అర్జీలు, కులధ్రువీకరణ సర్టిఫికెట్స్, రేషన్‌షాపుల తనిఖీలు, గ్రామసభలు, భూవివాదాల సమస్యలపై విచారణ ఏసమస్య అయినా రెవెన్యూ ఇన్స్పెక్టర్ నివేదిక తప్పనిసరి. రెవెన్యూలో కీలకంగా వ్యవహరించాల్సిన ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండడంతో రైతుల భూసమస్యను, మరే ఇతర సమస్యలు నిర్ణీత గడువుల పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ఆర్ఐ లేకపోవడంతో రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. రైతులు వీఆర్వోలను ప్రశ్నిస్తే తమ పరిధిలో లేదని మేము నివేదికను తహశీల్దార్‌కు సమర్పించామని చేతులు దులుపుకుంటున్నారు.

అధికారుల ఆదేశాలు పాటించరా..?

యాదమరి మండలంలో ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ గతవారం చిత్తూరు ఆర్ఐగా ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సంతోష్‌ను చిత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా నియమించి, చిత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ ప్రసాద్‌ను యాదమరికి రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా బదిలీ చేశారు. పై అధికారులు బదిలీ చేసిన గానీ ఆర్ఐ విధుల్లో ఇంతవరకు చేరలేదు. ఎందుకు చేరలేదని సంబంధిత అధికారులకే తెలియాల్సి ఉంది. గ్రూప్ 4లో సెలెక్ట్ అయిన మునియజ్ఞ తేజను యాదమరి తహశీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా వేశారు. వీరిద్దరూ విధుల్లో చేరాల్సి ఉంది.

ఎన్నికల విధులకు ఆర్ఎస్‌డి, డిప్యూటీ తహశీల్దార్

మండలంలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న, డిప్యూటీ తహశీల్దార్, రిసర్వ్ డీటీలు ఎన్నికల విధులకు 15 రోజులపాటు వెళ్ళనున్నారు. వెంటనే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి యాదమరికి ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ ఛార్జీల మోత

- పగలే..చుక్కలు చూపేడుతున్న కరెంట్ బిల్లులు
- వినియోగం వందలో.. బిల్లు వేలల్లో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సర్దుబాటు ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు.. పేరు ఏదైతేనేమి వినియోదారుడుకి పగలే.. చుక్కలు చూపుతున్నాయి కరెంట్ బిల్లులు... నిత్యావసర ధరల, పెరిగిన కరెంట్ చార్జీలతో నెలసరి బడ్జెట్ పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల నెత్తిబొబ్బికడుతోంది. నిత్యావసరాలు ఆకాశానంటున్నాయి. పప్పుల ధరలు ఈనెలలోనే 37 శాతం పెరిగాయి. ఇక గతంలో కిలో టమోటా రూ.200లు అమ్ముడు పోయినా దిగుబడి పెరగడంతో కిలో రూ.15 నుంచి 20లకు స్థిరంగా ఉంది. ఒక్కసారిగా టమోటా ధరల పతనం కావడంతో టమోటా రైతులు రోడ్లపై పారేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కందిపప్పు రూ.80లనుంచి 160లకు పెరిగింది. మినపప్పు, వేరుశనగా, వంటనూనె ధరలు ఒక్క నెలలోనే 22 శాతం పెరిగాయి. సన్న బియ్యం కిలో రూ.55 నుండీ రూ. 60లకు పెరిగింది. వీటికి తోడు పెరిగిన కరెంట్ బిల్లులు సామాన్య, మధ్యతరగతికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.



శివకుమార్‌కు ఈనెల రూ. 1,120 వచ్చిన విద్యుత్ బిల్లు

విద్యుత్ ఛార్జీల మోత

ఎఫ్‌పిపిసిఏ పేరుతో నెలవారీ విద్యుత్ వినియోగదార్లపై అదనపు ఛార్జీలు పడుతున్నాయి. ట్రూఅఫ్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటి డ్యూటీ పేర్లతో విద్యుత్ వినియోదారుల వీపులు విమానం మోత మ్రోగిపోతోంది. ఒక సంవత్సరంలో వినియోదారుల నుంచి నాలుగువేల కోట్లు ప్రజల నుండీ వివిధ రూపాల్లో చార్జీల రూపంలో ప్రభుత్వం లాగేసే ప్రయత్నం చేయడంతో నెలవారీ విద్యుత్ బిల్లులు వేలల్లో వస్తున్నాయి. భవిష్యత్‌లో రైతులు వాడుతున్న మోటర్లకు మీటర్లు బిగిస్తే రైతుల పరిస్థితి ఆగమ్మగోచరం కానుంది.

వినియోగం వందలో.. బిల్లు వేళల్లో..

విద్యుత్ వినియోగం వందల్లో ఉంటే ప్రభుత్వం ట్రూఆప్, సర్‌చార్జీ, ఫిక్స్‌డే, ఎలక్ట్రిసిటిడ్యూటి ఇలా వివిధ రకాల పేరుతో మనం వాడుకుంటున్న కరెంట్ చార్జీలో కలపడంతో బిల్లు మాత్రం వేలల్లో వస్తోంది. చిత్తూరు నగరంలో కొండమిట్టలో నివాసం ఉంటున్న శివకుమార్ అనే ఓ సామాన్యుడికి ఈనెల విద్యుత్ బిల్లు రూ.1,120 వచ్చింది. బిల్లు చూసి షాక్‌కు గురైన శివకుమార్ వెంటనే తన ఇంటికి వచ్చిన బిల్లు అందించిన మీటర్ రీడింగ్ బాయ్‌కు పోన్‌చేశాడు. ఇదేదంయ్యా.. నేను వాడిన కరెంట్ యూనిట్లకు రూ.200 బిల్లు మాత్రమే రావాల్సి ఉంటుంది. రూ.1,120 బిల్లు ఇచ్చావ్' అని అడిగితే అదంతే ప్రభుత్వాన్ని అడుగు నీకు ఇచ్చిన బిల్లులో నువ్వు వాడిన కరెంట్‌కు వచ్చిన బిల్లు రెండు వందలే అయితే మీ ఇంటి వరకు కరెంట్ లాగిన విద్యుత్ వైర్, కరెంట్‌పోల్ సర్వీస్ ఛార్జీ, ట్రూఆప్ చార్జీ, ఫిక్స్‌డ్ చార్జీ ఇలా రకరకాల పేర్లుతో వేసిన చార్జీల వల్ల నీకు ఇచ్చిన కరెంట్ బిల్లు కాస్తా రూ.1,120 వచ్చింది. ఏం చేయలేమంటూ వెళ్లిపోయాడు ఇదీ పరిస్థితి. వేలల్లో విద్యుత్ బిల్లులు రావడంతో బిత్తర చూపులతో విద్యుత్ వినియోదారులు అల్లాడిపోతున్నారు.

నీవా నదిలో గ్రానైట్ వ్యర్థాలు

- పట్టించుకోని ఇరిగేషన్, పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి- యాదమరి: నీవా నదిలో గ్రానైట్ వ్యర్థాలు రాళ్ళు, నీరు వదిలేయడంతో నీవా నదిలోని నీరు పూర్తిగా కలుషితమైపోతోంది. మండల కేంద్రంలోని జోడిచింతల, మార్లబండ గ్రామాల పరిధిలోని ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీ వారు వ్యర్థాలను వారికి కేటాయించిన డంపింగ్ యార్డ్‌లో మాత్రమే తోలాల్సి ఉన్న వారు నిబంధనలు పాటించకుండా ఎక్కడపడితే అక్కడే వ్యర్థాలను తోలేస్తున్నారు. వారి ఫ్యాక్టరీలో ఏర్పడిన వ్యర్థపు రాళ్ళు, జలాలను సైతం నీవానదిలోకి వదిలేస్తున్నారు. ఈ వ్యర్థపు నీరు ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీవా నది నిండా ప్రవహిస్తూ సాగు, తాగునీరును కలుషితం చేస్తున్నాయి. ఈ నీటిని నది పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు చేసుకుంటున్న రైతులు పొలాలకు చేరడంతో సారవంతమైన భూములు పంటలు పండించేందుకు వీలు లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పరివాహక ప్రాంతంలోని తాగునీటి బోరు బావులు నీరు సైతం కలుషితం అవుతున్నాయి. గ్రానైట్ ఫ్యాక్టరీలు చిత్తూరు గుడియాత్తం రోడ్డు కిరువైపులా వ్యర్థాలను తోలడంతో ఓవర్టేక్ చేసే సమయంలో వాహనాలు గ్రానైట్ రాళ్ల వల్ల ప్రమాదాల భారిన పడుతున్నాయి. గ్రానైట్ ఫ్యాక్టరీ వాళ్లు నీవానదిని కలుషితం చేస్తున్నారని గ్రామంలోని ప్రజలు పంచాయతీ అధికారుల దష్టికి పలుమార్లు తీసుకెళ్లిన వారు తమకేమీ అన్నట్లు మిన్నకుండుతున్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న గ్రామపంచాయతీ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు నీవానదిని కలుషితం చేస్తున్న ఫ్యాక్టరీలపై చట్టప్రకారం చర్యలు తీసుకొని భూగర్భ జలాలను సంరక్షించాలని పలువురు రైతులు ప్రజలు కోరుతున్నారు.



నీవా నదిలో వదులుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు

వంటమ్మలకు వంటల పోటీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాంఘీక సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో పనిచేస్తున్న వంటమ్మలకు ఆదివారం స్థానిక అంబేద్కర్ భవనలో వంటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సాంఘీక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వంటలు చేసే వంటమ్మలకు ఏ విధంగా రుచి, సుచి కలిగిన వంటలను తయారు చేసి అందించాలనే అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెనూ ప్రకారం అందించిన పప్పు, బియ్యం, నూనే ఇతర వస్తువులతో తయారు చేసిన వంటను రుచి చూసి బాగా తయారు చేసిన వారి ద్వారా ఇతరులు అర్థం చేసుకొనేలా వివరించడం జరుగుతోందన్నారు. వసతి గృహాల ఎస్‌డబ్ల్యూఒలు, నిర్వహకులు, వంటమ్మలు పాల్గొన్నారు.



మహిళా అభివృద్ధే డిఆర్‌డిఏ లక్ష్యం

శిక్షణ, ఆర్థిక చేయూతతో ముందుకు
గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మహిళా ఆర్థిక అభివృద్ధి కోసం గ్రామీణాభివృద్ధి సంస్థ పనిచేస్తోంది. ఇందు కోసం మహిళలను స్వయం సహాయ సంఘాలుగా ఏర్పాటు చేయడం ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అవసరమైన రుణాలను అందించడంతో పాటు స్వయం శక్తితో ఎదిగేలా వృత్తి విద్యాశిక్షణ అందించడం అవసరమైన ముడిసరుకుల కొనుగోలు కోసం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నడుస్తున్నారు. జిల్లా సమాఖ్య ప్రతినెలా సమావేశం నిర్వహించి సమీక్ష చేస్తోంది. మండల పరిధిలో సమాఖ్య భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. జగనన్న షాపింగ్ మాల్స్ ద్వారా స్వయం సహాయ సంఘాల్లోని సభ్యులు తయారు చేస్తున్న వస్తువులతో పాటు కార్పొరేట్ సంస్థల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. వీటిల్లో వస్తున్న లాభాలను తిరిగి సంఘ సభ్యులకు అందజేయడం జరుగుతోంది. దేశ,రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జిల్లా స్వయం సహాయ సంఘాల ప్రతిభ చాటుతున్నారు. నవోదయం పత్రిక అవార్డును సొంతం చేసుకుంది. ప్రభుత్వం మహిళా అభివృద్ధి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి కోరారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో గ్రామీణాభివృద్ధి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు.



తులసి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్

ప్రజాశక్తి : సామాజిక పెన్షన్స్ డిఆర్‌డిఏ ద్వారా అందిస్తున్నారు, అవి ఎన్ని రకాలు, ఏవి?

పిడి: వైఎస్ఆర్ పెన్షన్ కానుక పేరుతో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, అభయహస్తం, కల్లుగీత, ఒంటరి మహిళ, హిజ్రాలు, మత్స్యకారులు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, డప్పుకళాకారులు, చర్మ కళాకారులు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు, సైనిక వెల్ఫర్ ఫించన్లను అందించడం జరుగుతోంది. రూ.2,500 నుండీ రూ. 2,750ల వరకు పెంచడం జరిగింది. ఉమ్మడి జిల్లాలో 54,1461 మంది పింఛన్ పొందుతున్నారు.

ప్రజాశక్తి : వైఎస్ చేయూత ఎంత మందికి అందిస్తున్నారు?

పిడి: 45 సంవత్సరాల నుండీ 60 సంవత్సరాలు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750లచొప్పున ఏడాదికి రూ.75వేలు మంజురు చేయడం జరుగుతోంది. స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకోవడం కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. 2023 మూడో విడతలో 19,9459 మంది లబ్ధిదార్లకు రూ.373.99 కోట్లు లబ్ధిదార్ల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: వైఎస్ఆర్ ఆసరా ద్వారా రుణమాఫి ఎంత ?

పిడి: వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాన్ని మాఫీ 2019మే మాసం 17వ తేదీ నాటికి బ్యాంకులో ఉన్న నిల్వ 60.44 సంఘాల పొదుపు ఖాతాలకు నాలుగు విడతల్లో రూ. 2318.82 కోట్లు జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి : వైఎస్ఆర్ సున్నా వడ్డీ ఎంత మంది సభ్యులకు అందజేశారు?

పిడి: నవరత్నాలు అమల్లో భాగంగా స్వయం సహాయక సంఘసభ్యులకు వైఎస్ఆర్ సున్నావడ్డీకి రుణాలు అందించేలా 2020 మే 24వ తేది ప్రారంభించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 62,556 స్వయం సహాయ సంఘాల రూ.155.22 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 67,391 స్వయం సహాయ సంఘాలకు రూ.124.20 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 68,440 స్వయం సహాయక సంఘాలకు రూ.134.05 కోట్లు సభ్యులు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి

- ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయకుంటే సమ్మెకు సిద్ధం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలకు తెలంగాణ లాగా జీతాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయకుంటే సమ్మెకు సిద్ధమవుతామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. ఆదివారం చిత్తూరులో యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం శ్యామల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల దగ్గర అన్ని ప్రభుత్వ పనులు చేయించుకుంటూ వారి సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో, రాష్ట్రంలో శిశు మరణాలు రేటు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్నది అంగన్వాడీలే అని మరి ఇలాంటి పథకాన్నికి నిధులు తగ్గించడం సిగ్గుచేటు అని, వెంటనే నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను రకరకాల పద్ధతుల్లో వేధించడం మానుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పోరాటం చేస్తుంటే ఉక్కుపాదంతో అణచివేయడం ఏమిటి ప్రశ్నించారు. ప్రజాఉద్యమాలను అణచిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని గుర్తు చేశారు. మహిళలను రాత్రిలో కూడా మహిళలను పోలీస్‌స్టేషన్లో పెట్టడం దారుణమని, కొత్త కొత్త యాప్‌లు పెట్టి అంగన్వాడీలకు మానసిక ఒత్తిడి తీసుకురావడంతో అనారోగ్య సమస్యలు తీవ్రంగా వస్తున్నాయని, వీటితో పాటు అంగన్వాడీలకు ప్రమోషన్లు ఇవ్వాలని, మినీ వర్కర్‌ను మెయిన్ వర్కర్స్‌గా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న స్థానిక సమస్యలపై పోరాటాలు నిరంతరం చేయాలన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం చాలా నాసిరకంగా ఉండడంతో వారు అంగన్వాడీలపై ఒత్తిడి చేస్తున్నారని, మంచి ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి షకీల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా నాయకులు పద్మ, పంచవర్ణ, ప్రమీల, మమత, లీల, జిల్లాలోని 12 ప్రాజెక్టుల నాయకులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

అష్టావధానుల కంటే మహిళలు ఘనులు

మహిళా సాధికారతకు బాలికలను చైతన్యవంతులు చేయాలి
యుటిఎఫ్ మహిళా రాష్ట్ర సదస్సుల్లో వక్తలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి

అష్టావదానుల కంటే మహిళలు ఘనులని ప్రొఫెసరు కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. ఎస్‌టిఎఫ్ఐ పిలుపు మేరకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తిరుచానూరు రోడ్డులోని తాజ్‌హోటల్ ఎదురుగా ఉన్న అశోక్ కన్వెన్షన్ హాల్‌లో మహిళా కన్వెన్షన్ ఆదివారం యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె మాట్లాడుతూ అష్టావదానులు ఓ సభలో వచ్చే ప్రశ్నలకు మాత్రమే సమాదానాలు ఇస్తారని, కానీ మహిళలు ఇంటి పని, వంట పని, పిల్లల పోషణ, భర్త, అత్తమామల ఆలనపాలన, వ్యక్తిగత పనులుతో పాటు బయట ఉద్యోగాలు, కార్యాలయాల్లో పని ఒత్తిడి, స్నేహితులకు సహకారం, ఇలా నిత్యం ఒత్తిడితో సవాసం చేస్తూ కూడా అనేక పనుల్లో పాలుపంచుకుంటారని ఇది మహిళలకు ప్రతి రోజు ఎదరయ్యే సవాళ్లే అని, అలాంటి వారు అష్టావదానులకంటే ఘనులే అని ఉద్ఘటించారు. ప్రొఫెసరు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు జీవితాన్ని పర్సనల్, ప్రొఫెసనల్ రెండు బాగాలుగా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రొఫెసనల్ లైఫ్‌లో పర్సనల్ లైఫ్ విషయాలను చర్చించకుడదని, అప్పడే వారికి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ప్రతి ఒకరికి బలాలు బలహీనతలు ఉంటాయి, వాటిని గుర్తెరికి నడుచుకోవాలన్నారు. స్త్రీలు నగలు, చీరలు, మేకప్‌లపై ఆశతోనే జీవిస్తారని చెడ్డపేరు ఉందని, దాన్ని అధిక మించి గురజాడ అన్న విధంగా ఆధునిక మహిళా చరిత్ర సృష్టించగలదని నిరూపించాలని పిలుపునిచ్చారు. ఎస్‌టిఎఫ్ఐ నాయకురాలు అరుణకుమారి మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగం మూలమని, అలాంటి రాజ్యాంగాన్ని కూడా పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అందుకు నేడు కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న పాలకుల తీరే కారణమన్నారు. సనాతన ధర్మం పేరుతో మహిళలను అణగదొక్కేందుకు పూనుకున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కూడా మహిళలకు అమలు చేయడం లేదన్నారు. ఇటీవల పార్లమెంట్ కొత్త భవనంలో ఆమోదించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును బిజెపి- ఆర్ఎస్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండు చేశారు. మహిళలకు అనేక చట్టాలు తెచ్చారని, కానీ వాటను అమల్లోకి మాత్రం తీసుకురావడం లేదన్నారు. మహిళా చట్టాలను పాలకులు అమలు చేయాలని సదస్సుల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అందుకు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ఆడవారికి ఆడవారే శత్రువు అంటున్నారని, కానీ ఆడ వారికి వంటిల్లే శత్రువు అని అన్నారు. మహిళలు ఇంటిపనికే పరిమితం అయితే సమాజంలోని పరిస్థితులపై ఎప్పుడు చైతన్యవంతులవుతారని, నాయకత్వ లక్షణాలు ఎలా మెరుగు పరుచుకుంటారని ప్రశ్నించారు. ఈ సమాజంలోని అసమానతలను ప్రశ్నించకపోతే సమానత్వాన్ని సాధించలేమన్నారు. ప్రభుత్వ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్ సంస్థలు అప్పనంగా అప్పగించేస్తున్నాయని అన్నారు. హిందూమతం, సనాతన ధర్మం గొప్పదని చెబుతారు మరీ సమానత్వం ఎందుకు చూపరని మోడి ప్రభుత్వాన్ని నిలదీశారు. హిందుత్వం పేరుతో బిజెపి- ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ముస్లింలను శత్రువులుగా చూస్తోందని, వారు పూజించే తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామికి ఇద్దరు భార్యలు ఉన్నారని, అందులో ఒకరు పద్మావతి హిందువు, బీబీనాంచారి ముస్లీం అన్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. మీరు పూజించే దేవుళ్లకే లేని భేదాలు మీకెందుకని ధ్వజమెత్తారు. మతం, సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేయాలని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీన్ని మహిళలోకం తీవ్రంగా వ్యతిరేకించి, ఎదుర్కొవాలని, మహిళలను కనీసం మనిషిగా కూడా పరిగణించిన బిజెపి- ఆర్ఎస్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయురాలు వారి వద్ద చదువుకునే బాలికలు వాస్తవాలు తెలియజేయాలని, సనాతన ధర్మం పేరుతో మహిళలకు జరుగుతున్న నష్టాలను వివరించి, చైతన్యవంతులను చేయాలని, అపుపడు భవిష్యత్తు తరాలు మహిళా సాధికారితను సాధించగలవని సూచించారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఏం.సంయుక్త మాట్లాడుతూ మహిళలు ఉద్యమంలోకి రావడం ద్వారానే సమస్యలు పరిష్కరించ బడతాయని తెలిపారు. నిరంతరం సమాజంలో జరుగుతున్న విషయాలను అధ్యయనం చేయాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమంలోను, సాయుధ తెలంగాణ పోరాటంలో మహిళలు ఎక్కువ మంది పాల్గొనడం ద్వారానే ఉద్యమం విజయం సాధించిందని తెలిపారు. వ్యవసాయ నల్లచట్టాలు వెనక్కి తీసుకోవడంలో మహిళలు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ నిర్మాణ కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. జాతీయ కార్యదర్శి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు కన్వెన్షన్‌ని ప్రారంభించారు. తిరుపతి జిల్లా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.శ్రీదేవి ముందుగా వక్తలను వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ కన్వెన్షన్‌లో మహిళా రక్షణ చట్టాన్ని పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయాలని, సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో రెస్టురూమ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో తాలూకా, జిల్లా స్థాయిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, మహిళా ఉపాధ్యాయులకు ఆదాయ పన్ను పరిమితిని 7లక్షలకు పెంచాలని, మహిళా ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాలు చైల్డ్‌కేర్ లీవ్ మంజూరు చేయాలని, భర్తకు ఉద్యోగం లేనప్పుడు మహిళ ఉపాధ్యాయులపై ఆధారపడిన అత్తమామను కూడా డిపెండెంట్‌గా చేర్చాలని, ఏ స్థాయిలోనూ మహిళల పట్ల వివక్ష ఉండకూడదని, అలా వివక్షతో కూడినటువంటి ప్రకటన వెంటనే రద్దు చేయాలని, పనిప్రదేశాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గాపీ మరి ఎక్కడైనా మహిళలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని, తీర్మానాలను చేశారు. ఈ కన్వెన్షన్‌లో జాతీయ జెండాను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్-ఎస్.నాయుడు, ఎస్‌టిఎఫ్ఐ జెండాను ఆ సంఘం సహాధ్యక్షులు సంయుక్త ఎగురవేశారు. యుటిఎఫ్ కార్యదర్శి నాగమణి, బి.సుభాషిని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శ్రీదేవి, డి.నిర్మల, కే.విజయ్ గౌరి, మాజీ రాష్ట్ర కార్యదర్శిలు జయప్రద, ఎస్ఎస్ నాగమణి, లీల, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జివి.రమణ యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కోమ్మొజు శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి బి.లక్షిరాజ, ప్రరణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, ఉపాధ్యాయురాళ్లు, మహిళలు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం బాలత్రిపురసుందరి అమ్మవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. బాలత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో అర్చకులు హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. భక్తులకు కావలసిన సౌకర్యాలను ఆలయ కమిటి అధ్యక్షులు ప్రసాద్ పర్యవేక్షించారు. ఉభయదారులు ఉదయ్‌కుమార్, నందకుమార్‌లు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటి ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసింది.

ఎస్ఆర్‌పురం: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని వి.వి.పురంలోని ఆరిమాని గంగమ్మ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. డిప్యూటి సిఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టిసి వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఏకవీర ఫౌండేషన్ ప్రతాప్ స్వామీజీ అమ్మవారికి ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు.



పట్టువస్త్రాల సమర్పిస్తున్న డిప్యూటి సిఎం

చౌడేపల్లి: నవరాత్రి బ్రహోత్సవాలు బోయకొండలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు గంగమ్మ తల్లి బాలత్రిపుర సుందరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. బెంగళూరుకు చెందిన ఉదయదారులు మంజుల కుంటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో చంద్రమౌళి భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.లక్ష, వెండి సామాగ్రి వితరణ

బోయకొండ గంగమ్మకు భక్తుడు శరణ్‌కుమార్‌రెడ్డి దంపతులు రూ.3.50లక్షల వెండి సామాగ్రి, రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఆలయ ఈవోకి అందజేశారు.

సోమల: కందూరులో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి.

చిత్తూరుఅర్బన్: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజస్థాన్ సేవా సంఘం నేతృత్వంలో ఆదివారం స్థానిక బిజెడ్ స్కూల్‌లో తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం ప్రతినిధి సుభాష్ జైన్ తెలిపారు. రోజూ దేవి అలంకారాలు, సాయంత్ర సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైన్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్‌పై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అంగన్వాడీ టీచర్‌పై దాడి హేయమైన చర్య అని మాలమహానాడు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి అన్నారు. మండలంలోని సంపల్లి గ్రామ ంలో అంగన్వాడీ టీచర్ అనితపై జరిగిన దాడిని ఖండిం చారు. దాడిలో గాయపడిన అనిత పుంగనూరు ఆసుపత్రి లో ఉండగా ఆదివారం ఆమెను పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వరదరాజ, హర్షవర్ధన్ తదితరులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుబ్రమణ్యం, మంజునాథ్, తిప్పయ్య, రామచంద్ర, వెంకటేష్, రెడ్డెప్ప, నాగరాజు, చంగల్రాయప్ప తదితరులు బాధితురాలిని పరామర్శించారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న నేతలు

క్రైం న్యూస్

నాటు సారా స్వాధీనం - ఒకరి అరెస్టు


ప్రజాశక్తి-సోమల: బైక్‌లో నాటుసారా తరలిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. మండలంలోని గల్లావారిపల్లెకు చెందిన శెట్టి ప్రభాకర్ బైక్‌లో సారాతో గుర్తించి అరెస్ట్ చేసి, ఐదు లీటర్ల సారా, బైక్‌ని సీజ్ చేసి అతనిపై కేసు నమో దు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

సమిష్టి కృషితో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పోటుగాని భాస్కర్‌ను నియమించడం శుభపరిణామం అని ఆ పార్టీ మండల కన్వీనర్ కందుకూరి ఉమేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. భాస్కర్ ఆది నుంచి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినందుకే ఈ పదవి దక్కిందన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టి కృషితో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, లలితాభాస్కర్, జయచంద్ర, మునికృష్ణారెడ్డి, దావుద్‌భాషా తదితరులు ఉన్నారు.

తాగునీటి పైపుల్లో వానపాములు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: స్థానిక దళితవాడలో తాగునీటి పైపుల్లో వానపాములు రావడంతో మహిళలు ఆందోళనకు గురయ్యారు. ట్యాంకు శుభ్రత లేకపోవడం వల్ల ఇలా వానపాములు వస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంగా పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా వివరణ ఇస్తూ ట్యాంకు నెలకొకసారి శుభ్రం చేస్తున్నామని, ఇళ్లలోని సంపుల్లో గుండా వానపాములు రావచ్చునని పేర్కొన్నారు. సంపులు కూడా శుభ్రం చేసుకోవాలని సూచించారు.



తాగునీటి పైపుల్లో వానపాములు

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -ఏర్పేడు: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు సూచించారు. జగనన్న ఆరోగ్య సర్వేను సర్పంచ్ మోహన్ ప్రియ ఆధ్వర్యంలో ఎండి పుత్తూరు లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకువెళ్లి ప్రతి ఒక్కరూ సద్విని చేసుకునేలా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్యసేవలు వైద్యశాలలకు పంపి ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తారన్నారు. ఈ సర్వేలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని మీ ఆరోగ్య సమస్యలను వివరంగా తెలిపి తగిన వైద్య సలహాలు పొందాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్య, ఏఎన్ఎం లలిత, ఆశా కార్యకర్త సునీత, వాలంటీరు రవి పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం గూడూరు పట్టణంలోని గాంధీ స్మారక పాఠశాలలో కూరగాయలు , గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా జెవివి ప్రధాన కార్యదర్శి నాగరాజు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత్ పెట్రోలియం సుపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెవివి సమాజానికి ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ సేవా కార్యక్రమానికి తాను భాగస్వామ్యం అయినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన నాగరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, గుర్రం విజయ్ బాబు, రాధయ్య, కటకం శ్రీను, నక్కా గోపి, సుబ్రహ్మణ్యం, సుధీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి రోజుకు ఏడు గంటలు విద్యుత్ : ఏఈ

ప్రజాశక్తి -సత్యవేడు, బిఎన్ కండ్రిగ: ఇకపై వ్యవసాయ రంగానికి రోజుకు 7 గంటలు పాటు విద్యుత్ సరఫరా ఉంటుందని సత్యవేడు విద్యుత్ శాఖ ఏఈ విజయ్ వెంకటేష్, బిఎన్ కండ్రిగ విద్యుత్ శాఖ ఏఈ పుణ్యకోటి పేర్కొన్నారు. వ్యవసాయ మోటార్లకు ఏడు గంటలు విద్యుత్ సరఫరాలో ఆయా సబ్ స్టేషన్ ఫీడర్ల అనుసరించి ఎ గ్రూపు, బి గ్రూప్ రెండు విధాలుగా అమలు అవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఎ గ్రూపులో వారం పాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. బి గ్రూపునకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు నిరంతర విద్యుత్తు సరఫరా అవుతుందని ఆయన వివరించారు. ఒక వారం ఎ గ్రూపు, మరోవారం బి గ్రూప్ పద్ధతిలో విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వ్యవసాయ రైతులు దీన్ని గమనించి అందుకు అనుగుణంగా సాగు చేస్తున్న పంటలకు నీరు పారేలా చూసుకోవాలన్నారు. గతంలో వ్యవసాయానికి 9 గంటల పాటు ఇస్తున్న విద్యుత్ సరఫరా వినియోగం, డిమాండు పెరిగిన నేపథ్యంలో విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు రెండు గంటల పాటు తగ్గిస్తూ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేశారన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ గూడూరు వైజెపి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం , దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. యువత సేవా కార్యక్రమాల పై మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గోపీనాథ్ రెడ్డి, ఫాస్ట్ రీజినల్ చైర్మన్ ఆర్‌విరావు, మాజీ ప్రసిడెంట్ రవీందర్ రెడ్డి , పాస్ట్ జోన్ చైర్మన్ మురళి నాయుడు, పసుపులేటి ప్రసాద్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉషోదయ ఫౌండేషన్ ద్వారా జాతీయ కవి సమ్మేళనం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి డాక్టరు ధనాశి ఉషారాణి ఆద్వర్యంలో భాకరాపేటలో నిర్వహించిన ఉషోదయ ఫౌండేషన్ సాహితీ సేవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నుండి కవులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో బోయి భీమన్న అవార్డులను , ఉషోదయ ఫౌండేషన్ సాహితీ సేవ అవార్డులను వివిధ రంగాల్లో సేవ చేసిన విశిష్ట వ్యక్తులకు అందించారు. ఇందులో ఉషోదయ ఫౌండేషన్ సాహితీ సేవ అవార్డులను 100 మందికి వివిధ రంగాల్లోని వారికి ప్రదానం చేసింది. ముఖ్య అతిథులుగా ఆదికవి నన్నయ్య, విశ్వవిద్యాలయ అధిపతి తరపట్ల సత్యనారాయణ , ప్రొఫెసర్ బుజ్జి ,మార్జియాన పోఫెసర్, తిరుపతి షీ టీమ్ ఆఫీసర్ సుమతీ , మెడికో బ్రాడ్ సి ఈ ఓ డా. రామ్ ,డైరెక్టర్ సంగీత, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఫాస్టర్ సైలెస్ ,ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ధనాశి ఉషారాణి , రామచంద్రయ్య వరప్రసాద్ రోహిల కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. నిర్వహించారు. సాహితీ చరిత్రలో ఓ మైలురాయిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని, నిర్వహించిన రచయిత్రి ఉషారాణిని పెద్దలు అభినందించారు.

గొడుగుచింతకు బోయి భీమన్న పురస్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గొడుగుచింత గోవిందయ్యకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ బోయి భీమన్న పురస్కారాన్ని అందుకున్నారు. తిరుపతి జిల్లా భాకరాపేటలో ఆదివారం ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ బోయి భీమన్న విశిష్ట సాహిత్య కృషి పై జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో 'గొడుగుచింత గోవిందయ్య పాల్గొని ప్రదర్శన కనబరిచారు. అనంతరం గోవిందయ్యకు ప్రతిష్టాత్మక బోయి భీమన్న పురస్కారం అందజేశారు.



ఒక్కశాతం కాదు.. ఐదుశాతం నిధులివ్వాలి: చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బడ్జెట్ నుండి తిరుపతి అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఒక్క శాతం కాకుండా ఐదు శాతం నిధులు ఇవ్వాలని పిసిసి ప్రధాన కార్యదర్శి గౌడపేరు చిట్టిబాబు ఒక ప్రకటనలో కోరారు. టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌గా స్వాగతిస్తున్నామని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఐదు శాతం నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇప్పుడు తీసుకున్న అభివృద్ధి నిధుల నిర్ణయాన్ని మార్పు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి అభివృద్ధికి అవరోధాలుగా బిజేపీ మారిందని, టిటిడి ఉద్యోగస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే బిజెపి నాయకులు కోర్టుకెళ్లడం, ఇప్పుడు తిరుపతి అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ కోసం వార్షిక బడ్జెట్లో ఒక శాతం నిధులు కేటా యించాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా వ్యతిరేకిస్తూ రోడ్లెక్కి నిరసన చేయడం అభివృద్ధి నిరోధకులుగా ప్రజలు వారిని చూస్తున్నారన్నారు. తిరుపతిలో సౌకర్యాలు ఏర్పాటు అయితే తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తులు గాని యాత్రికులు గానీ ఎంతో సంతోషంగా శ్రీవారిని దర్శించుకుని వెను తిరుగుతారని, అలా కాకుండా తిరుపతిలోనే సౌకర్యాలు లేకపోతే తిరుపతికి వచ్చే యాత్రికుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. టిటిడిలో పనిచేస్తూ రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా స్థలాలు త్వరగా ఇవ్వాలని ధర్మకర్తల మండల కి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలని నిరసనలు

ప్రజాశక్తి-కుప్పం: అక్రమ అరెస్టు నుంచి చంద్రబాబు విడుదల కావాలని కుప్పంలోని తిరుపతి గంగమ్మ ఆలయంలో ఆదివారం కృష్ణదేవరాయ బలిజ సంఘం నేతలు పూజలు చేశారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని అమ్మవారిని వేడుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మని, గోపి, రవి, కౌన్సిలర్ సోము తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలంటు మసీదులో మండలంలోని తాటిమాకులపల్లె మసీదులో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో లోకనాథరెడ్డి, మోహన్‌మురళి, చంద్రబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: అరెస్టులతో పోరాటాలు ఆపలేరని మాజీ సింగిల్ విండో అధ్యక్షులు హేమ చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జనార్దన్‌గౌడ్, లోకనాథం నాయుడు, కమల్లారెడ్డి, అమర్నాథ్ పాల్గొన్నారు.

వికోట: వీకోటలో టిడిపి నాయకులు చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ పాలకపక్షాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లా అనే కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రంగనాథ్, ఈశ్వర్, ధీంరాజ్, శబరీష్, రాము, నారాయణస్వామి ఉన్నారు.

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో టిడిపి నేతలు చంద్రబాబు అరె స్టును వ్యతిరేకిస్తూ పాలకపక్షాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం చేతికి తాడులు కట్టుకొని నిరసన తెలియజేశారు. స్వామి దాస్, శ్రీధర్‌యాదవ్, క్రిష్ణమ నాయుడు, దేవ సుందరం తదిరులు పాల్గొన్నారు.



చేతికి తాడు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

యదమల: మండలంలోని దళవాయి గ్రామంలో టిడిపి కన్వీనర్ మొరార్జి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

చిత్తూరుఅర్బన్: మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు రావా లని కోరుతూ దుర్గా నవరాత్రులను పురస్క రించుకొని స్థానిక బివిరెడ్డి కాలనీలోని టిడిపి నాయకులు జగన్మోహన్ తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక హోం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నవ చండీ హోమాన్ని నిర్వహించారు. జగన్ ప్రభుత్వం చంద్రబాబుపై పెట్టిన తప్పుడు కేసుల నుంచి నిర్దోషిగా విజయం సాధించి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజల ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు చేస్తున్నట్లు జిజెఎం ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్, తెలుగుదేశం నాయకులు గురజాల జగన్మోహన్ తెలిపారు.



పూజలు చేస్తున్న జగన్మోహన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కళాశాలలో 2001-2003బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ ప్రయివేటు హోటల్లో కలుసుకున్నారు. 20 ఏళ్ల ముందు కళాశాలలో జరిగిన జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొని ఆనందంగా గడిపారు.

చిన్ననాటి స్నేహితులను కలిసిన ఎంపి రెడ్డెప్ప

సోమల: చిన్ననాటి స్నేహితులతో కలసి ఎంపి రెడ్డెప్ప ఆనందంగా గడిపారు. మదుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొంటూ స్నేహితులతో పంచుకున్నారు. సోమలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మిత్రులను కలసి పలకరించారు. రాజారెడ్డి, వేణుగోపాలరెడ్డి, వెంకటరమణనాయుడు, వెంకటప్పనాయుడు, చెంగయ్య, ఎంపీపీ ఈశ్వరయ్య, కందూరు సర్పంచి భాష మసూద్ తదితరులు పాల్గొన్నారు.



చిన్ననాటి స్నేహితులతో ఎంపి రెడ్డెప్ప

'సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఓఎస్సి ఈఏ) జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పిబి బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మహాజనసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సాంఘిక సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీకుమారి హాజరయ్యారు. తొలుత చిత్తూరు జిల్లా సంఘం అధ్యక్షులుగా జ్ఞానశేఖర్, కార్యదర్శిగా ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాలసుబ్రమణ్యం, లక్ష్మీకుమారి జ్ఞానశేఖర్ మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖలో ఎన్నో సంవత్సరాలుగా అరకొర జీతాలతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. వేజ్ బోర్డ్ నియమ,నిబంధనల ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలన్నారు. అదేవిధంగా తమ కుటుంబాలలో వెలుగులు నింపేలా అర్హత కలిగిన వారందరి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైంస్కేల్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ముఖ్యంగా రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న తమకూ సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తాము బాసటగా నిలుస్తామని, సంబంధిత ఉద్యోగులు తమ సమస్యలను నిరభ్యంతరంగా తమకు తెలియజేస్తే తప్పకుండా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేష్, కార్య నిర్వహక కార్యదర్శి నాగేంద్ర, అన్నమయ్య జిల్లా సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

గణిత అవధానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జన విజ్ఞాన వేదిక ఆదివారం నిర్వహించిన సజన కార్యక్రమంలో గణిత శతావధానం చేసిన బాలగణిత మేధావి అనఘా లక్ష్మి విద్యార్థులతో మమేకమై గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు మెలకువలను తెలిపారు. ఈకార్యక్రమంలో గణిత అవధాని హెచ్.అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదికలో ప్రతి ఆదివారం విద్యార్థులకు నిర్వహించే సజన కార్యక్రమంలో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా 11 సంవత్సరాల వయసుకే పదో తరగతిని పూర్తిచేసి శతావధానిగా రాష్ట్ర మొత్తం గుర్తింపు పొందిన అనఘా లక్ష్మి గుంటూరు నుండి ఈ కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థుల్లో సజనాత్మక అంశాలను తెలియజేశారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ అనఘా లక్ష్మీ చేత 2021లో చిత్తూరులో మొట్టమొదట గణిత శతావధానాన్ని నిర్వహించామని ఆ కార్యక్రమం రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదని, జనవిజ్ఞాన వేదిక ప్రోత్సాహంతో ఆమె ఈ ఘనతను సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం మహిళా విభాగం జిల్లా కన్వీనర్ పాపుదేశీ జయంతి మాట్లాడుతూ మానవాళి అభివద్ధికి గణితమే ఆధారమని భవిష్యత్తులో ఉన్నతవిద్యను అధిరోహించేందుకు గణితం తోడ్పడుతుందని అందుకు అనఘా లక్ష్మి కషి నిదర్శనమని, లింకా బుక్ రికార్డులను సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో బాలయ్య, నగరంలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.



గణిత అవధానం కార్యక్రమంలో బాలమేధావి

గిడ్డకింద మాణిక్యంకు బోయి భీమన్న జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా లోని నారాయణవనం మండలం బ్రాహ్మణ తాంగల్‌కి చెందిన గిడ్డకింద మాణిక్యం కు ఉత్తమ కవితా విభాగంలో ఉత్తమ కవిగా బోయి భీమన్న జాతీయ స్మారక పురస్కారంతో ఉషోదయ ఫౌండేషన్ తిరుప తి వారు సత్కరించారు. జాతీ య స్థాయిలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని తన కవితలను చదివి వినిపించారు. సామాజిక స్పృహతో వ్యాసం, కథ, సమీక్ష , వచన కవిత రచన వంటి బహుళ ప్రక్రియల్లో సాహితీ సేవ చేస్తున్న మాణిక్యంకు ఉత్తమ కవి అవార్డుకు ఎంపిక చేశారని ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టరు ధనాశీ ఉషారాణి తెలిపారు. అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉందని మాణిక్యం తెలిపారు. భవిష్యత్తులో మరింత సాహితీ రచనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కల్పితమైన సమాచారం లేకుండా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని చంద్రగిరి డిఎస్‌పి యశ్వంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా, చంద్రగిరి పోలీస్ సబ్ డివిజన్, తిరుచానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముండ్లపూడి గ్రామంలో ఈ నెల 14వ తేదీ రాత్రి 10 గంటలకు ఆ గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తి తన ఇంటిలో క్షుద్రపూజలు జరుగుతున్నాయనే సమాచారం తిరుచానూరు పోలీసులకు వచ్చిందన్నారు. వెంటనే తిరుచానూరు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి సోమశేఖర్ ఇంటిని పరిశీలించారని, అక్కడ క్షుద్రపూజలు జరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని తెలిపారు. తన ఇంటికి వాస్తు దోషాలు ఉంటే గురువులు సూచన మేరకు అమావాస్య రోజు నవగ్రహ శాంతి పూజలు చేశారన్నారు. దీన్ని తప్పుగా భావించిన కొంతమంది స్థానికులు సామాజిక మాధ్యమాల్లో క్షుద్రపూజలు చేస్తున్నట్లు పోస్టులు పెట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలాంటి చర్యలు సరికావు కావన్నారు. ఎవరైనా క్షుద్రపూజలు జరిపినా లేదా క్షుద్రపూజలు చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం జరిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా అలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

18న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

ప్రజాశక్తి - సోమల: మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి ఈ నెల 18న ఎంపిపి ఎల్లప్ప తెలిపారు. పర్యటనకు సంబంధించి సోమవారం ఎంపిడివో కార్యాలయంలో సమీక్ష ఉంటుందన్నారు.

నేడు ఇరికిపెంటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపిటిసి హరినాథ్ తెలిపారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి డాక్టర్లు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ప్రజలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కలాం జయంతి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మండల కేంద్రములో పలు ప్రజా సంఘాల నాయకులు, ఆర్టీఐ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్టీఐ కార్యకర్తల సంఘం జిల్లా కన్వీనర్ డాక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగాల్లో చేసిన విశేష కృషి ఫలితంగా ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా ఎదిగారని, భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరొందారని అన్నారు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి మన దేశం వైపు చూసేలా చరిత్ర సష్టించిన శాస్త్ర సాంకేతిక విద్యావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, నూరేషా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ సలహాదారునికి సన్మానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారులుగా నియమించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం రాయటపేటకు వచ్చిన జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయనకు సలహాదారులుగా నియమించడం సంతోషించదగ్గ విషయమని సామాజిక కార్యకర్త చిన్న అన్నారు. కార్యక్రమంలో గజేంద్ర, సుబ్రహ్మణ్యం, మణి పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకి పరిష్కారం చూపండి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదు పట్ల తక్షణ స్పందన ఉండాలని డిఎస్పి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీసుల పట్ల విశ్వాసంతో ఫిర్యాదు స్టేషన్‌కి వస్తారని వారికి తగిన పరిష్కారం దొరికినప్పుడే పోలీసుల పట్ల సమాజంలో గౌరవం పెరుగుతుందని సూచించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కార్వేటినగరం సిఐ శరత్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ 23 పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డాలర్స్ గ్రూపు అధినేత దివాకర్ రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్ విశ్వచందన్ రెడ్డి, తిరుపతి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీధర్, కరాటే సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం విజయన్, క్యాండోర్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగశ్వేత, ఒలింపిక్ సంఘం కోశాధికారి సాయికుమార్ పాల్గొన్నారని టోర్నమెంట్ నిర్వాహకులు రత్నాకర్, వెంకటేష్ తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిమితికి మించి మనం తీసుకునే ఆహారం విషంలా పని చేసి తద్వారా లేనిపోని జబ్బులు మన శరీరంలోకి ప్రవేశిస్తాయని, మనదేశంలో గతంలో నలభై సంవత్సరాలు దాటిన వారికే సుగర్ జబ్బు వచ్చేదని, అది ఇప్పుడు చిన్న వయసులోనే వస్తోందన్నారు. సమతుల ఆహారం తీసుకుని సరైన వ్యాయామం చేయ డం ద్వారా ఎటు వంటి అనారోగ్య సమస్యలు రావని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం మనం చూడ వచ్చునని తెలి పారు. ముఖ్య అతిథి డాలర్స్ గ్రూపు అధినేత దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఆత్మరక్షణ కోసం మాత్రమే కాకుండా క్రమశిక్షణ కోసం తప్పకుండా కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని, ఇలాంటి క్రీడా పోటీలకు సహాయం చేయడానికి తమ డాలర్స్ సంస్థ ముందుంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నలు మూలల నుంచి దాదాపు మూడు వందల మంది క్రీడాకారులు, కరాటే శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాలి భానుప్రకాష్‌కు పరామర్శల వెల్లువ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసిపిదాడికి గురైన టిడిపి నగరి నియోజకవర్గ నాయకులు గాలి భానుప్రకాష్‌కు పరామర్శలు వెల్లు వెత్తు తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం నుంచే కాక చంద్రగిరి, గంగాధర నెల్లూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, పూతల పట్టు నియోజకవర్గం నుంచి టీడీపీ కుటుంబసభ్యులు, అభిమానులు, చిత్తూరు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పులివర్తి నాని, జి.నరసింహ యాదవ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం సుగుణమ్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు, పీఏసీ సభ్యులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సహా పలువురు నాయకులు భానుకి సంఘీభావం తెలిపారు.